RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 222 పేజీలు - 08 బుధవారం 08 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

# ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

**రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు**

**పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్**

**సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఉపయుక్తం**

**కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు**



**తొలి అక్షరం/హైదరాబాద్, 7 :** పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయ పడ్డారు. **మిగతాది 2లో...**



# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

**182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం**

**సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం -కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 7 :** తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం **మిగతాది 2లో...**




# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి**

**మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు**

**ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు**

**తొలి అక్షరం/అహ్మదాబాద్,జూలై 7:** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. **మిగతా 2లో...**



# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

**రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు**

**నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**తొలి అక్షరం/రంగారెడ్డి,జూలై 7:** రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి **మిగతాది 2లో...**





# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

**ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్**

తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 7: పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ర కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. మిగతాది 2లో...

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

## ఈ25 పెట్రోల్ పై కేంద్రం కీలక ప్రకటన

**ఈ25 పెట్రోల్ పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచన**

**వాహనాలపై ఈ25 అనుకూలతపై ఇంకా పరీక్షలు జరుగుతున్నాయని వెల్లడి**

**ఈ20 పెట్రోల్ పై మైలేజ్, ఇంజిన్ పనితీరుపై ప్రజల్లో నెలకొన్న ఆందోళనలు**

**దశలవారీగా, ఆచితూచి మాత్రమే ముందుకు వెళ్తామని ప్రభుత్వ హామీ**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 7 :** దేశవ్యాప్తంగా 25 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ25)ను త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అటువంటి ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ వదంతుల నేపథ్యంలో వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను నివృత్తి చేసే **మిగతాది 2లో...**




# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

ఇంటింటి సర్వే జరపకుండా మజ్లిస్ శిబిరాల్లో ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపణ

బీఎల్ఓలు నిబంధనలు పాటించడం లేదని ఈసీకి ఫిర్యాదు

తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన బీజేపీ నేతలు



2లో.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు


**పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం**

**జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు**

**ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి**

**ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లింపు**

**చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం లో కీలక నిర్ణయాలు**



**తొలి అక్షరం/అమరావతి,జూలై 7 :** సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూమిలిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూములు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంఠాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, **మిగతాది 2లో...**



# భోగాపురం సిద్ధం..

## విమానాశ్రయం త్వరలో ప్రారంభం

**భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు**

**అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి**

**మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి**

**తొలి అక్షరం/అమరావతి,జూలై 7:** ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో **మిగతాది 2లో...**

# భోగాపురం సిద్ధం..

(మొదటి పేజి తరువాయి)

జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

# ఈ25 పెట్రోల్ తెచ్చే ప్రతిపాదన లేదు

(మొదటి పేజి తరువాయి)

ప్రయత్నం చేసింది. ఈ25 ఇంధనాన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకువస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్రం ఉద్ఘాటించింది. వివిధ వాహన మోడళ్లపై ఈ25 మిశ్రమం యొక్క అనుకూలతపై ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయని, పూర్తిస్థాయి నివేదికలు అందిన తర్వాతే దీనిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఈ20 (20 శాతం ఇథనాల్) పెట్రోల్ సురక్షితమైనదని, అది సమర్థవంతంగా పనిచేస్తోందని వారు తెలిపారు.

ముడి చమురు దిగుమతులు తగ్గించడం, పర్యావరణ పరిరక్షణ, మరియు చెరకు రైతులను ఆదుకోవడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే నిర్ణీత గడువు కంటే ముందే భారత్ ఈ20 లక్ష్యాన్ని చేరుకుంది. అయితే, ఈ20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గడం, పాత వాహనాల ఇంజిన్ల పనితీరు దెబ్బతినడం వంటి ఆందోళనలు సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే ఈ25 వస్తుందనే వార్తలు వాహనదారుల్లో మరింత ఆందోళన రేకెత్తించాయి. ఇటీవల ప్రభుత్వం ఈ22 నుంచి ఈ30 వరకు ఇథనాల్ మిశ్రమాలపై ఎక్సైజ్ సుంకం మినహాయింపు ఇవ్వడంతో ఈ25 త్వరలోనే వస్తుందనే ఊహాగానాలు పెరిగాయి. అయితే, ఈ20 తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా అది దశలవారీగా ఉంటుందని, వాహన తయారీ సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. ధృవీకరించని సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని కేంద్రం ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# పాతబస్తీలో ఓటర్ల నమోదుపై బీజేపీ అభ్యంతరం

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 7:** హైదరాబాద్ పాతబస్తీలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని బీజేపీ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసిన ఆ పార్టీ నేతలు ఫిర్యాదు చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరగడం లేదని, దానికి బదులుగా మజ్లిస్ పార్టీ నేతలు ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారానే ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఫారాల పంపిణీకే పరిమితం కాకుండా, పూర్తి చేసిన దరఖాస్తులను అప్‌లోడ్ చేసేందుకు వినియోగించే ఎన్నికల సంఘం అధికారిక యాప్‌ను సైతం మజ్లిస్ నేతలకే అప్పగిస్తున్నారని బీజేపీ తన ఫిర్యాదులో పేర్కొంది. పాతబస్తీతో పాటు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో చాలామంది ఓటర్లకు కనీసం దరఖాస్తు ఫారాలు కూడా అందలేదని వివరించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఈ సందర్భంగా పలు అంశాలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లింది. హైదరాబాద్‌లో కేవలం ఆంగ్ల భాషలో, జిల్లాల్లో తెలుగులో ఫారాలను పంపిణీ చేయడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చి స్థిరపడిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇంటింటి సర్వేను తప్పనిసరి చేయాలని, ఓటర్లు అందుబాటులో లేని పక్షంలో బీఎల్ఓలు కనీసం మూడుసార్లు వారి ఇళ్లను సందర్శించేలా ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఓటర్ల జాబితా సవరణ కోసం జూన్ 25న ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగనుంది. జూలై 31న ముసాయిదా జాబితాను, అక్టోబర్ 1న తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

# పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

(మొదటి పేజి తరువాయి)

తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

(మొదటి పేజి తరువాయి)

ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. 2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్‌లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోద్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

# భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

(మొదటి పేజి తరువాయి)

వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ పక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

# ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)

ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

(మొదటి పేజి తరువాయి)

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతు న్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

(మొదటి పేజి తరువాయి)

లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు.

సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు.

తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాము లయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు కేటాయించామని కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 బొగ్గు గనులపై తుది నిర్ణయం తీసుకున్నామన్నారు.

దాదాపు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు.

దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ.64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

# చరిత్ర సృష్టించిన మోదీ..

## ఇండోనేషియా పార్లమెంట్‌లో ప్రసంగించిన తొలి భారత ప్రధాని



**తొలి అక్షరం/న్యూ ఢిల్లీ, జూలై 7:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇండోనేషియా పర్యటనలో చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారు. జకార్తాలో మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారత ప్రధానిగా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. ఇరు దేశాల మధ్య ఉన్న నాగరికత, చారిత్రక వారసత్వ సంబంధాలను గుర్తుచేస్తూ, ప్రాంతీయ స్థిరత్వం కోసం ఉమ్మడిగా కృషి చేయాల్సిన ఆవశ్యకతను ఆయన తన ప్రసంగంలో నొక్కిచెప్పారు. భారత్, ఇండోనేషియాలను సముద్రాలు వేరుచేయడం లేదని, చరిత్ర, సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలనే వారధులు రెండు దేశాలను అనుసంధానం చేస్తున్నాయని మోదీ పేర్కొన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి ఇరు దేశాల మధ్య దృఢమైన సాంస్కృతిక బంధం ఉందని ఆయన గుర్తుచేశారు. తమకు ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు, పార్లమెంట్‌లో ప్రసంగించే అరుదైన అవకాశం కల్పించిన స్పీకర్‌కు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఇండోనేషియా ఎన్నికల వ్యవస్థ ఆధునికీకరణకు భారత్ పూర్తి సహకారం అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) అభివృద్ధిలో తోడ్పాటునందిస్తామని, అదేవిధంగా ఇండోనేషియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. భారత ప్రభుత్వ పథకాలను తమ దేశంలోనూ అమలు చేస్తామని గతంలో ఇండోనేషియా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "మిత్రుల మధ్య కాపీరైట్లు ఉండవు" అని మోదీ చమత్కరించడంతో సభలో నవ్వులు విరిశాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న సుహృద్భావ వాతావరణానికి ఈ వ్యాఖ్య అద్దం పట్టింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం రెండు దేశాల మధ్య సహకారం అత్యంత కీలకమని ప్రధాని ఉద్ఘాటించారు. జూలై 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు.

# ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల కమీషన్‌ను శాస్త్రీయంగా పునఃసమీక్షించండి

● ప్రధాని మోదీకి ఎఫ్ఎల్డీఐ జాతీయ అధ్యక్షులు పింగళి వెంకటేశ్వరరావు వినతి ● పాత లెక్కలతోనే కమీషన్ల నిర్ణయం..వాస్తవ ఖర్చులు భారీగా పెరిగాయి ● స్వతంత్ర కమిటీతో సమగ్ర అధ్యయనం చేయించాలని డిమాండ్

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి. సైదులు),జూలై 7:** దేశవ్యాప్తంగా ఉన్న ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల కమీషన్‌ను శాస్త్రీయంగా పునఃసమీక్షించి, ప్రస్తుత కమీషన్ నిర్ణయ విధానాన్ని సమగ్రంగా మార్చాలని ఫెడరేషన్ ఆఫ్ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎల్డిఐ) జాతీయ అధ్యక్షులు,ఆల్ ఇండియా హెచ్‌పీ గ్యాస్ డీలర్స్ అసోసియేషన్ సలహాదారు పింగళి వెంకటేశ్వరరావు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు ఆయన మంగళవారం ప్రధానికి ఒక సమగ్ర వినతిపత్రాన్ని పంపారు. గత కొన్ని దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయూవై),డీబీటీఎల్ (పిఎచ్ఎఎల్), ఆధార్ అనుసంధానం, డిజిటల్ సంస్కరణల వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లు కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తుచేశారు.కోవిడ్ మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరాయంగా సేవలు అందించామని,తాము కేవలం వ్యాపారులం మాత్రమే కాదని.. దేశ నిర్మాణంలో భాగస్వామ్యులమని పేర్కొన్నారు.

### ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతానికి



### డిస్ట్రిబ్యూటర్ల ఆర్థిక స్థిరత్వం అవసరం:

ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (పిఎస్యూఎస్) బలోపేతం కావాలంటే వాటి చివరి అంచెగా పనిచేస్తున్న డిస్ట్రిబ్యూటర్లు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని వినతిపత్రంలో వివరించారు. ఒక కుటుంబం బలంగా ఉండాలంటే ప్రతి సభ్యుడు ఆర్థికంగా బలంగా ఉండాలి.డిస్ట్రిబ్యూటర్లు బలహీనపడితే చివరి దశ సేవల నాణ్యత, భద్రత, సమర్థత దెబ్బతింటాయి. అందువల్ల డిస్ట్రిబ్యూటర్లను బలోపేతం చేయడం అంటే ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడమే అని పింగళి వెంకటేశ్వరరావు, జాతీయ అధ్యక్షులు (ఎఫ్ఎల్డిఐ) అన్నారు.

### పెరిగిన ఖర్చులు.. అపసవ్య విధానాలు:

ప్రస్తుతం ఉద్యోగుల జీతాలు, రవాణా వ్యయం, ఇంధన ధరలు, వాహనాల నిర్వహణ, బీమా, డిజిటల్ వ్యవస్థలు, భద్రతా ప్రమాణాలకు అయ్యే ఖర్చులు ఎన్నో రెట్లు పెరిగినప్పటికీ, డీలర్ కమీషన్ మాత్రం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న కమీషన్ విధానం కేవలం కంప్యూటర్ ఆధారిత గణనలు, పాత ఖర్చుల ప్రమాణాలపైనే ఆధారపడి ఉందని.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డిస్ట్రిబ్యూటర్లు ఎదుర్కొంటున్న వాస్తవ నిర్వహణ వ్యయాలు, స్థానిక సమస్యలు ఈ సూత్రంలో ప్రతిబింబించడం లేదని స్పష్టం చేశారు.

### ప్రధాన డిమాండ్లు: స్వతంత్ర కమిటీ ఏర్పాటు:

పెట్రోలియం మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు, ఆర్థిక నిపుణులు, గుర్తింపు పొందిన డిస్ట్రిబ్యూటర్ల సంఘాల ప్రతినిధులతో కూడిన ఒక స్వతంత్ర శాస్త్రీయ కమిటీని ఏర్పాటు చేయాలి.

### సమగ్ర అధ్యయనం:

దేశవ్యాప్తంగా వాస్తవ నిర్వహణ వ్యయాలపై ఈ కమిటీ ద్వారా సమగ్ర అధ్యయనం జరిపించాలి.

### పారదర్శక విధానం:

కాలానుగుణంగా సవరించుకునేలా పారదర్శకమైన, న్యాయమైన నూతన కమీషన్ విధానాన్ని రూపొందించాలి. ఆర్థికంగా బలమైన డిస్ట్రిబ్యూటర్ వ్యవస్థ అనేది దేశ ప్రయోజనాలకు, కోట్లాది వినియోగదారుల భద్రతకు అత్యంత అవసరమని..బలమైన డిస్ట్రిబ్యూటర్లు, బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు,బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు,బలమైన భారతదేశానికి పునాది అనే నినాదంతో ప్రధాని మోదీ ఈ విషయంలో దయామయ జోక్యం చేసుకోవాలని పింగళి వెంకటేశ్వరరావు కోరారు.

# చేనేత అభివృద్ధే లక్ష్యం: బడుగు మోహన్

● ప్రచారంలో పాల్గొన్న చౌటుప్పల్ పురపాలక సంఘం వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్







**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 7:** చౌటుప్పల్ చేనేత సహకార సంఘాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని చైర్మన్ అభ్యర్థి బడుగు మోహన్ తెలిపారు.చేనేత సహకార సంఘం ఎన్నికల సందర్భంగా చైర్మన్ అభ్యర్థిగా బడుగు మోహన్, డైరెక్టర్లుగా కాటబత్తిని భీమయ్య, గోశిక నరసింహ, గోశిక లక్ష్మీపతి, గోశిక శ్రీకాంత్, దోర్నాల లక్ష్మీనారాయణ, పాపని రామకృష్ణ తమ ప్యానెల్ తరఫున చిన్న కొండూరు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను కలిసి తమ ప్యానెల్ గుర్తులపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా బడుగు మోహన్ మాట్లాడుతూ, జన్మభూమిపై ఉన్న మమకారంతోనే చేనేత సహకార సంఘం అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నానని తెలిపారు. ప్రతి చేనేత కార్మికుడికి చేతినిండా పని కల్పించడం, ప్రతి కుటుంబానికి సంఘం ద్వారా ఆర్డర్ ఫారాలు అందించడం, ప్రతి కార్మికుడికి జియోట్యాగ్ అమలు చేయడం, ముడి సరుకులను సబ్సిడీపై అందించేలా కృషి చేయడం తన ప్రధాన లక్ష్యాలన్నారు.అలాగే, ఆపదలో ఉన్న ప్రతి నిరుపేద చేనేత కుటుంబానికి అండగా నిలుస్తానని, అవినీతి మరియు అక్రమాలకు తావులేకుండా నిజాయితీ, పారదర్శక పాలన అందిస్తూ చేనేత రంగ అభివృద్ధికి సేవా కార్యక్రమాలు చేపడతానని బడుగు మోహన్ పేర్కొన్నారు.

# Scientifically review the LPG distributors commission

- Appeal to Prime Minister Modi by FLDI National President Pingali Venkateshwar Rao

**Tholi Aksharam/ Editor(P.Saidulu),June7:**

Representation to the Hon»ble Prime Minister of India Request for a Scientific Revision of LPG Distributor Commission and Commission MethodologyHon»ble Prime Minister,At the outset, I, on behalf of the LPG distributor fraternity across the country, eIpress our sincere gratitude for your visionary leadership and unwavering commitment to the welfare of the people of India. Under your dynamic leadership, the Government has ensured uninterrupted LPG supply, protected consumers from the impact of global price volatility, and eItended timely support to the Public Sector Oil Marketing Companies (PSUs), thereby strengthening India»s energy security. These landmark initiatives reflect your Government»s commitment to »»Nation First»» and have earned the admiration and confidence of the nation.With utmost humility, we submit that LPG distributors are not merely business associates of the Public Sector Oil Marketing Companies they are an integral and inseparable part of the PSU family. The relationship between the PSUs and their distributors is one of partnership, mutual trust, and shared responsibility. While the PSUs procure and market LPG, it is the distributors who ensure its safe, timely, and reliable delivery to every household, often under the most challenging circumstances.Over the decades, the LPG distributor fraternity has repeatedly proved its unwavering commitment to the nation and to your Government»s vision. We have stood shoulder to shoulder with the Government in every major national initiative. The phenomenal success of the Pradhan Mantri Ujjwala Yojana (PMUY), Direct Benefit Transfer (DBTL), Aadhaar integration, digital transformation, and numerous public welfare programmes became possible because of the tireless efforts of LPG distributors at the grassroots level. During the COVID`19 pandemic, when the entire nation came to a standstill, LPG distributors worked fearlessly on the frontlines, risking their own health and that of their families to ensure uninterrupted LPG supply to millions of households. Despite unprecedented challenges, we never allowed the nation»s kitchens to go without cooking fuel. Time and again, we have demonstrated that whenever the nation calls, LPG distributors respond with dedication, discipline, and a spirit of selfless service. We have always considered ourselves partners in nation`building rather than mere commission agents.Hon»ble Prime Minister, just as your Government has shown deep concern in safeguarding the financial health of the Public Sector Oil Marketing Companies, we humbly request that the same concern be eItended to the LPG distributors who constitute the last and most vital link in this national service chain. A family is strong only when every member is financially secure. Likewise, the long`term strength and success of the Public Sector Oil Marketing Companies depend upon the financial sustainability of their distributors. If distributors become financially weak, the efficiency, safety, and reliability of the last`mile LPG delivery system will inevitably suffer. Protecting distributors is, therefore, strengthening the PSUs themselves.Today, LPG distributors across the country are under unprecedented financial stress. Employee wages, transportation costs, fuel prices, vehicle maintenance, insurance premiums, digital infrastructure, technology upgrades, safety compliance, statutory obligations, and customer service eIpenses have increased manifold over the years. Simultaneously, the responsibilities entrusted to distributors have eIpanded significantly. However, the dealer commission has not kept pace with these realities, making it increasingly difficult to maintain the high standards of service eIpected by the Government and the public.We most respectfully submit that the issue today is not merely the enhancement of dealer commission but the urgent need to fundamentally revisit the methodology adopted for determining it. The present commission formula appears to rely predominantly on theoretical assumptions, automated calculations, and outdated cost parameters. It does not adequately capture the actual operational realities faced by distributors at the grassroots level. Every region has unique challenges, and many unavoidable costs incurred in delivering safe and efficient LPG service remain outside the eIisting formula.We, therefore, humbly request your kind intervention to review not only the quantum of dealer commission but also the entire commission determination mechanism. We respectfully suggest that a comprehensive scientific cost study be undertaken by an independent committee comprising representatives of the Ministry of Petroleum Ê Natural Gas, the Public Sector Oil Marketing Companies, financial eIperts, and recognised representatives of the LPG distributor fraternity. Such a committee should assess the actual cost of operations across different regions of the country and recommend a transparent, equitable, realistic, and periodically reviewable commission formula that truly reflects present`day economic conditions and ground`level realities.Such an approach would not merely address the immediate issue of commission enhancement but would create a sustainable framework for the future, ensuring fairness, transparency, and long`term financial viability for distributors while simultaneously strengthening the operational efficiency and service capabilities of the Public Sector Oil Marketing Companies.Hon»ble Prime Minister, an economically viable LPG distributor network is not a matter of private benefitÑ it is a matter of national interest. Every LPG cylinder delivered safely and on time represents the commitment, investment, and dedication of thousands of distributors and their employees working across the length and breadth of the country. Their financial stability directly determines the quality, safety, reliability, and continuity of this essential public service.We, therefore, earnestly appeal to your kind intervention for a fair, scientific, and realistic revision of LPG dealer commission together with a comprehensive review of the methodology for its determination. Such a decision would not merely enhance dealer commissionÑ it would strengthen the foundation of India»s LPG distribution system, reinforce the Public Sector Oil Marketing Companies, and ensure uninterrupted, safe, and efficient service to more than 33 crore LPG consumers across the country.We have complete faith that under your compassionate, decisive, and visionary leadership, justice will be done to the LPG distributor fraternity, whose unwavering dedication has significantly contributed to the success of every major LPG reform and public welfare programme of your Government.A financially strong distributor network creates stronger Public Sector Undertakings. Stronger Public Sector Undertakings ensure stronger energy security. Stronger energy security builds a stronger India. With highest regards,



`Pingali Venkateshwar Rao`National President Federation of LPG Distributors of India `Advisor All India HP Gas Dealers Association

# జూలై 10 విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి: ఎస్ఎఫ్ఐ



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 7:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రజాస్వామ్యవాదులు విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు పిలుపునిచ్చారు. చౌటుప్పల్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యారంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించడం, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, వీజూ, ఐజూ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందించడంతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే విద్యార్థులకు ఉచిత రవాణా, ఆధునిక మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు కల్పించాలని, విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన విద్యా హామీలను అమలు చేయడంతో పాటు విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు దోనూరి శ్రావణ్, తిరిడి వరుణ్, మండల నాయకులు పోలేపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ ఎదుకలు



**తొలి అక్షరం/మహాదేవపూర్ జూలై 7:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామ శాఖ అధ్యక్షుడు లేతకరి అవినాష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ మంద కృష్ణ మాదిగ 62వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మాదిగల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం ఎంఆర్పీఎస్ చేస్తున్న ఉద్యమం ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. సంస్థ ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు చాకినారపు రాజు, మాజీ అధ్యక్షుడు శనిగరం గణపతి, మాజీ ఉపసర్పంచ్ ఆరుట్ల పవన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గందేసిరి సత్యం, గందేసిరి మధు, బీఆర్ఎస్ వార్డు సభ్యుడు నిట్టూరి మహేష్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మంగయ్ లక్ష్మణ్, విజయ్ రెడ్డి, నాగునూరి రాజు, లేతకరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి భేటీ





**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 7:** యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ పార్టీల వివిధ గ్రామాల సర్పంచులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు, స్థానిక సమస్యలపై సర్పంచులు ఎమ్మెల్యేతో చర్చించారు. స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో చౌటుప్పల్, నారాయణపురం మండలాలకు చెందిన వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## చెన్నూరు మద్దులపల్లి కాళేశ్వరం ఆర్టీసీ బస్‌కు గ్రీన్ సిగ్నల్..!



**తోలి అక్షరం,మహాదేవపూర్, జూలై 7:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామ ప్రజల ఎన్నో రోజుల నిరీక్షణకు త్వరలో తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. చెన్నూరుమద్దులపల్లికాళేశ్వరం ఆర్టీసీ బస్ సర్వీస్ ప్రారంభానికి సంబంధించిన సర్వేను మంచిర్యాల ఆర్టీసీ డిపో అధికారులు పూర్తి చేశారు.గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత ఇటీవల రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్లను కలిసి ఈ బస్ సర్వీస్‌నుప్రారంభించాలని కోరగా, వారి సూచనల మేరకు అధికారులు ప్రతిపాదిత మార్గాన్ని పరిశీలించి సర్వే నిర్వహించారు. అవసరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే బస్సు సేవలను ప్రారంభిస్తామని అధికారులు తెలిపినట్లు సర్పంచ్ సరిత వెల్లడించారు.ఈ బస్ సర్వీస్ ప్రారంభమైతే మద్దులపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు చెన్నూరు, కాళేశ్వరం ప్రాంతాలకు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం లభించనుంది. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నేలకొరిగిన విద్యుత్ స్థంభాలు ట్రాన్స్ఫార్మర్ జాడలేని విద్యుత్ అధికారులు..!

**ప్రమాద ఘంటికలు మోగుతున్నా స్పందన శూన్యం.. విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం..!**

**ముళ్లపొదల్లో ట్రాన్స్‌ఫార్మర్లు.. వంగిన స్తంభాలు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?**





**తొలి అక్షరం/ఏన్కూర్ జులై 7:** ఏన్కూర్ మండలం భగవాన్ నాయక్ తండా నుంచి రేపల్లెవాడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై విద్యుత్ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. రహదారి పక్కనే విద్యుత్ స్థంభాలు నేలకొరిగి ఉండగా, మరికొన్ని వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. ఈ దృశ్యాలు చూసిన గ్రామస్తులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్థంభాల చుట్టూ ముళ్లపొదలు, అడవి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను తాకేంత వరకు విస్తరించినా వాటిని తొలగించడంలో విద్యుత్ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో బలమైన గాలులు, వర్షాల వల్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. దీంతో షార్ట్‌సర్క్యూట్, విద్యుత్ సరఫరా అంతరాయం, అగ్నిప్రమాదాలు, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు, పాదచారులు, వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడానికి భయపడుతున్నారు.ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హడావుడిగా స్పందించడం కంటే, ముందుగానే కూలిపోయిన విద్యుత్ స్థంభాలను మార్చి కొత్త స్థంభాలు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లోని పొదలను తొలగించి భద్రతా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రాణాల కంటే అధికారుల నిర్లక్ష్యమే ముఖ్యమా? అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రమాదకర పరిస్థితు లను తొలగించాలని, లేకపోతే పెద్ద ప్రమాదానికి బాధ్యత ఎవరు వహిస్తారని నిలదీస్తున్నారు.

# నర్సరీగా మారిన పాఠశాల ఆటస్థలం..!

**ఆటస్థలంలో నర్సరీ ఏర్పాటు.. విద్యార్థుల క్రీడలకు బ్రేక్**

**పాములు, తేళ్ల భయంతో ఆటలకు దూరమవుతున్న చిన్నారులు.. అధికారుల తీరుపై విమర్శలు**



**తొలి అక్షరం/ఏన్కూర్ జులై 7:** ఏన్కూర్ మండలం శ్రీరామగిరి గ్రామపంచాయతీ పరిధిలోని లచ్చగూడెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఆటస్థలాన్ని నర్సరీగా మార్చడంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లలు ఆడుకోవాల్సిన మైదానంలో నర్సరీ మొక్కలు ఏర్పాటు చేయడంతో క్రీడలకు పూర్తిగా ఆటంకం ఏర్పడిందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పాఠశాల ఆటస్థలంలో నర్సరీ ఏర్పాటు చేయడంతో మైదానం మొత్తం మొక్కలు, నీటి గుంతలతో నిండిపోయింది. దీంతో విద్యార్థులు పరుగులు తీయడానికి, క్రీడలు ఆడుకోవడానికి కనీస స్థలం కూడా లేకపోయిందని అంటున్నారు. నర్సరీకి ప్రతిరోజూ నీరు పోయడం వల్ల మైదానంలో తేమ పెరిగి పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు.విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఆటస్థలం ఎంతో అవసరమని విద్యావేత్తలు చెబుతున్నారు. అయితే అదే మైదానాన్ని నర్సరీగా మార్చడం వల్ల పిల్లలు క్రీడలకు దూరమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్య హక్కుతో పాటు క్రీడల హక్కును కూడా అధికారులు కాపాడాల్సిన బాధ్యత ఉందని వారు పేర్కొంటున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే పాఠశాల ఆటస్థలంలో ఉన్న నర్సరీని మరో అనుకూల ప్రదేశానికి తరలించి, విద్యార్థులకు ఆటస్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# బంజారాల సీత్ల భవానీ పండుగ.. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

- **ఆరోగ్యం, సుభిక్షం, పాడి పంటల కోసం భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆరాధన**
- **బంజారా జాతి ఐక్యతను చాటిచెప్పే ఆధ్యాత్మిక వేడుక**
- **సేవాలాల్ ఉద్యోగ సేన రాష్ట్ర అధ్యక్షులు భూక్యా బాబూలాల్ నాయక్**



**తొలి అక్షరం/ఏన్కూర్ జులై 7:** తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల్లో నివసించే బంజారా (లంబాడీ) సమాజం అత్యంత పవిత్రంగా భావించే పండుగల్లో సీత్ల భవానీ పండుగ ఒకటి. బంజారా ప్రజలు తమ ఇలవేల్పు దేవతగా కొలిచే సీత్ల భవానీ మాతను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తూ గ్రామాలు (తండాలు), కుటుంబాలు, పశుసంపద, పంటలు, ప్రజల ఆరోగ్యం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తారు. ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభంలో ఈ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

**అంటువ్యాధుల నుంచి రక్షించే దేవతగా విశ్వాసం** బంజారా సంప్రదాయం ప్రకారం సీత్ల భవానీ అమ్మవారు ప్రజలను అంటువ్యాధులు, ప్రకృతి విపత్తులు, కష్టనష్టాల నుంచి కాపాడే శక్తిగా భావిస్తారు. పూర్వకాలంలో వైద్య సౌకర్యాలు అందుబాటులో లేని సమయంలో ప్రజలు ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కోసం సీత్ల భవానీని ప్రార్థించేవారు. ఆ విశ్వాసమే కాలక్రమేణా సీత్ల భవానీ పండుగగా రూపుదిద్దుకుని నేటికీ బంజారా సమాజంలో విశిష్ట స్థానం సంపాదించుకుంది.

**సంప్రదాయ ఆచారాలతో ప్రత్యేక పూజలు** పండుగ సందర్భంగా తండాలోని ప్రతి కుటుంబం కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంది. మహిళలు సంప్రదాయ బంజారా దుస్తులు, వెండి ఆభరణాలు ధరించి పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, పండ్లు, నైవేద్యాలు సమర్పిస్తారు. కొన్ని ప్రాంతాల్లో సంప్రదాయం ప్రకారం పశుపూజ కూడా నిర్వహిస్తారు. కుటుంబ సభ్యులు, పశుసంపద, పంటలు ఆరోగ్యంగా ఉండాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థిస్తారు.

**జానపద కళలకు వేదిక** సీత్ల భవానీ పండుగ సందర్భంగా తండాల్లో జానపద గీతాలు, సంప్రదాయ నృత్యాలు, సామూహిక వేడుకలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. బంధుమిత్రులు, బంధువులు ఒకేచోట చేరి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం బంజారా సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది.



**సంస్కృతి పరిరక్షణకు ప్రతీక** సీత్ల భవానీ పండుగ కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా బంజారా జాతి సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ ఐక్యత, తండా ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతి, పశుసంపద, వ్యవసాయం పట్ల కృతజ్ఞతను తెలియజేస్తూ ఆరోగ్యం, శాంతి, సుభిక్షం కోసం నిర్వహించే ఈ పండుగకు బంజారా సమాజంలో విశేష ప్రాధాన్యం ఉంది.

**భావితరాలకు అందించాల్సిన సంప్రదాయం** సామాజికవేత్తలు, బంజారా పెద్దలు మాట్లాడుతూ, "సీత్ల భవానీ పండుగ కేవలం ఒక ఆచారం కాదు.. అది బంజారా జాతి సంస్కృతి, విశ్వాసం, ఐక్యతకు ప్రతీక. పూర్వీకులు అందించిన ఈ గొప్ప వారసత్వాన్ని పరిరక్షించి భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొంటున్నారు.

# అజ్మీర మంగ్యా నాయక్ తండాలో ఘనంగా సీత్లా పండుగ బంజారాల ప్రకృతి ఆరాధ్య దైవం

**- అజ్మీర మంగ్యా నాయక్ తండా సర్పంచ్ మాలోత్ వెంకట్ నాయక్.**

**- వరంగల్ జిల్లా లంబడ ఐక్యవేదిక (లైవ్ )అధ్యక్షులు మాలోత్ దేవేందర్ నాయక్ జాదవ్**





**తొలిఅక్షరం/నెక్కొండ జూలై 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని అజ్మీర మంగ్యా నాయక్ తండా గ్రామపంచాయతీలో గిరిజనుల ప్రకృతి ఆరాధ్య దైవం తండాలలో సీత్లా పండుగను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా లంబాడ ఐక్యవేదిక అధ్యక్షులు (లైవ్) మాలోత్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ సాంప్రదాయమే మన గుర్తింపు, సీత్లా పండుగ మన గౌరవం, గిరిజనుల ఐక్యతే మన బలం, సంస్కృతి పరిరక్షణ, మన బాధ్యత,ప్రతి ఇంట ఆనందం, ప్రతి మనసులో ఐక్యత, సంస్కృతిని కాపాడుకుందాం, గిరిజన అస్తత్వాన్ని చాటుకుందాం. గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్లా మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించడం జరిగింది. నెక్కొండ మండలాలలోని అన్ని గిరిజన తండాలలో సీత్లా పండుగను ఐక్యంగా అత్యంత ఘనంగా నిర్వహించడం జరిగింది, వరంగల్ జిల్లా( లైవ్) అధ్యక్షులు మాలోత్ దేవేందర్ నాయక్ పిలుపుమేరకు ఘనంగా సీత్లా పండుగను జరుపుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వరంగల్ జిల్లా (లైవ్) అధ్యక్షులు మాలోత్ దేవేందర్ నాయక్ జాదవ్ మాట్లాడుతూ సీత్లా పండుగ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది గిరిజనుల యొక్క సాంస్కృతి సాంప్రదాయాల, ఐక్యతలకు మరియు ఆత్మ గౌరవానికి ప్రతీక అని కొనియాడారు. మన పూర్వీకులు మనకు అందించిన ఈ గొప్ప సాంప్రదాయ వారసత్వాన్ని, కాపాడుకుంటూ మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించడం , ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. నెక్కొండ మండలంలోని గిరిజన సంఘాల నాయకులు గ్రామ పెద్దలు, యువత, మహిళలు,ప్రజా ప్రతినిధులు ప్రతి గిరిజన కుటుంబం ఈ పండుగలో భాగస్వాములు కావాలని కోరారు. తమ తమ తండాలలో భక్తి శ్రద్ధలతో ఆనంద ఉత్సాహాలతో సీత్లా పండుగను విజయవంతం చేయడం జరిగింది, లైవ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు మాలోత్ దేవేందర్ నాయక్ జాదవ్ తమ కుటుంబాల సభ్యులు పాల్గొనడం జరిగింది ..

# కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విక్రమ్





**తొలి అక్షరం/రామన్నపేట జూలై 7:** రామన్నపేట మండలంఇంద్రపాలనగరం లో గల అతి ప్రాచీన పురాతన శ్రీ శ్రీ శ్రీ పద్మావతి అలివేలు మంగ సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తృతీయ వార్షిక కళ్యాణంలో పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి వేదపండితుల మంత్రోచ్చారాణాలతో స్వామి వారి కళ్యాణం లో పాల్గొన్న సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఆలయం ఆధునికారణం కోసం విరాళాలు ఇచ్చి ప్రాచీన దేవాలయాలని రక్షించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ నల్లజయసుధ స్వామి, వార్డ్ సభ్యులు చిన్నలచ్చి శంకరమ్మ,రేపాక పారిజాత,పుట్టల లక్ష్మమ్మ,వడ్లకొండ లక్ష్మి,రాజన్నగారి రమేష్,రవ్వ నర్సింహా, చిన్నపాక శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ గర్ధాస్ వెంకటేష్, పాలసంగం చైర్మన్ కంబాలపల్లి శ్రీశైలం, సింగణబోయిన మల్లేశం, పగుడాల వెంకటేశం, గర్ధాస్ శ్రీకాంత్, గర్ధాస్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# చిర్ర రాము గౌడ్‌ను సన్మానించిన ముచ్చర్ల గౌడ సంఘం




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ లోని ముచ్చర్ల గ్రామం గౌడ సంఘం & పరపతి సంఘం ఆధ్వర్యంలో ఇటీవల 1వ, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామకమైన చిర్ర రాముగౌడ్ ను గజ మాల,శాలువా తో ఘనంగా సత్కారించడం జరిగింది.ఈ సందర్బంగా గౌడ సంఘం బాద్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షునిగా నియమించ బడిన చిర్ర రాము వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు సహకారంతో సంఘం యొక్క అభివృద్ధికి తొడ్పాటు అందించాలని కోరారు.అదే విదంగా చిర్ర రాము గౌడ్ మాట్లాడుతూ...ఎమ్మెల్యే ఆశీస్సుల తో కాంగ్రెస్ పార్టీ 1వ డివిజన్ అధ్యక్షునిగా బాధ్యతాయుతంగా నడిచి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలియచేసారు.గ్రామంలోని గౌడ సంఘం తో పాటు అన్ని కులాలకు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను చేరవేసేలా తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.అలాగే గౌడ కులంలో పుట్టినందుకు గర్విస్తూ.. ఇతర కులాల వారిని గౌరవిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు చిర్ర నాగరాజు,గౌడ సంఘం నాయకులు చిర్ర సోమయ్య,చిర్ర వీరస్వామి,సత్యం,సంపత్,బొమ్మ రమేష్,రాజు,చిర్ర అశోక్,చిర్ర నరేష్,గౌడ పరపతి సంఘం అధ్యక్షులు మదూరి మనోహర్,చిర్ర రాజు,శేషాచలం,చిరంజీవి,రాజేష్ తాబేటీ రమేష్,విక్రమ్,అరెల్లి సతీష్,చిర్ర బుచ్చిరాజశీ,కునూరు గణేష్,బొమ్మెర వంశీ తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా బంజారాల సీతలా (దాటుడు) పండుగ

**అత్యంత భక్తిశ్రద్ధలతో**

**అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**సమృద్ధిగా వర్షాలు, పాడి పంటలు పండాలని బంజారా ప్రజల ప్రార్థనలు**



**తొలి అక్షరం/ఏన్కూర్ జూలై 7:** ఏన్కూర్ మండలం గార్లఒడ్డు గ్రామంలో బంజారా సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే సీతలా (దాటుడు) పండుగ మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. బంజారా ప్రజలు సంప్రదాయ ఆచారాలను పాటిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో సుఖశాంతులు నెలకొనాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.బంజారా సంప్రదాయం ప్రకారం ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభంలో చిన్న పుష్యాల కార్తె మొదటి మంగళవారం రోజున సీతలా పండుగను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ బంజారా వేషధారణలో అమ్మవారికి పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకేచోట చేరి మొక్కులు చెల్లించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.పండుగ సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని బంజారా సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. ఈ పండుగ బంజారా సమాజంలో ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గార్లఒడ్డు గ్రామ సర్పంచ్ భూక్య నర్సి లాలూ, గ్రామ నాయక్, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్




**తొలి అక్షరం/రామన్నపేట జులై 7:** రామన్నపేట మండలంశోభనాద్రిపురం గ్రామ సెక్రెటరీ పవన్ కూతురు మొదటి పుట్టినరోజు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన దుబ్బాక గ్రామ మాజీ సర్పంచ్ డిసీసీ కమిటీ మెంబర్ గుండాల నర్సింహాఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండాల సతీష్,శెట్టి శేఖర్,జడల శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అధికారులతో సమీక్ష నిర్వహించిన అదనపు కలెక్టర్ ఎన్. రవి,డిసిపి ధార కవిత**



**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** ఈ నెల 9వ తేదీన రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా హనుమకొండ,వరంగల్ జిల్లాల్లో పర్యటించనున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి సంబంధిత అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ)లో డీసీపీ ధారాకవిత,జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌తో కలిసి పోలీసు,జిల్లా ఉన్నతాధికారులతో గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...గవర్నర్ పర్యటనకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రతి ఏర్పాటును సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.గవర్నర్ పర్యటనలో భాగంగా ఉదయం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల ప్రదర్శన స్టాళ్లను గవర్నర్ పరిశీలిస్తారని తెలిపారు.అనంతరం ఐడీఓసీ సమావేశ మందిరంలో హనుమకొండ,వరంగల్ జిల్లాల అధికారులతో సమావేశమై ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మక అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తారని వివరించారు.తదనంతరం హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని సందర్శించి అక్కడి సేవా కార్యక్రమాలను పరిశీలిస్తారని తెలిపారు.అనంతరం హన్మకొండ పెద్దమ్మగడ్డలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఏక్సిలెన్స్ ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలు,వసతులను పరిశీలిస్తారని,అనంతరం భద్రకాళి అమ్మవారి దేవాలయంను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు.గవర్నర్ పర్యటించే అన్ని ప్రాంతాల్లో భద్రత,ట్రాఫిక్ నియంత్రణ,పారిశుద్ధ్యం,తాగునీటి సరఫరా,విద్యుత్,వైద్య సదుపాయాలు,పార్కింగ్ తదితర ఏర్పాట్లను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించి గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళికాధికారి సత్యనారాయణరెడ్డి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను,అసిస్టెంట్ పోలీసు కమిషనర్ నర్సింహారావు,జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి శేషాద్రి,రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేష్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు డా.పి.విజయచంద్రారెడ్డి,ఈవి శ్రీనివాస్ రావు,గోపాల్,పోలీసు, రెవెన్యూ,సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు

- **రిషారియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు**
- **అవగాహన కల్పించిన రియా మౌర్య**



**తొలి అక్షరం/రామన్నపేట జులై 7:** ప్రజలు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యం తో జీవనం సాగించాలని రియా మౌర్య అన్నారు. హైదరాబాద్ లోని దోమలగూడ లో రిషారియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సు లో అక్కడి ప్రజలకి ప్రజల ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. అక్కడ మురికి కాలువలు ఎక్కువ ఉంది, దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి వల్ల రానున్న రోజుల్లో వర్షాల కారణంగా మురికి నీ లేకుండా చేసుకోవాలని, ఇళ్ల చుట్టూ పక్కల ప్రదేశాలని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహా భాగ్యం అనే నినాదం తో అందరూ ముందుకు సాగుతూ, ఆరోగ్యం పట్ల ఎవరు కూడా నిర్లక్ష్యం చేయకూడదని, ఎలాంటి జబ్బుల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆరోగ్యం పట్ల ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, రానున్న కాలంలో రిషారియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ కాంపు లు ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు

# గిరిజనుల ఆరాధ్య దైవం.. ఘనంగా శీత్లా పండుగ



**- పిట్టకాల్ బోర్డు తండా గ్రామ పంచాయతీ సర్పంచ్, బాదావత్ సూర్య నాయక్.**



**తొలి అక్షరం/నెక్కొండ జులై 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని పిట్టకల్ బోర్డు తండా గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ బాదావత్ సూర్య నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా శీతుల పండుగ నిర్వహించడం జరిగింది. గ్రామస్తులు మరి సీత్లా భవాని ప్రకృతి ఆరాధ్య దైవాన్ని ప్రకృతిలో ఆరాధిస్తూ పశువులను దాటుడు,శీతల భవాని పండుగను చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాదావత్ సూర్య నాయక్ మరియు గ్రామస్తులు బంజారా మహిళలు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ కమిషన్ నెక్కొండ మండల అధ్యక్షులుగా ఎన్నికైన బొల్ల రంజిత్ యాదవ్ ని సన్మానించిన నక్షత్ర యూత్ అధ్యక్షులు, సభ్యులు



**తొలిఅక్షరం/నెక్కొండ జూలై 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి ఇటీవల జాతీయ బీసీ కమిషన్ అధ్యక్షులు గా బొల్ల రంజిత్ యాదవ్ ఎన్నికైన సందర్భంగా వారిని నెక్కొండ పట్టణం లో ఘనంగా సన్మానం చేసిన నక్షత్ర యూత్ అధ్యక్షులు సింగం అరుణ్, మరియు సభ్యులు బండి శివ కుమార్, బూర్గు నరేష్, కుస విజేందర్ కందిక ప్రవీణ్ ఇదునూరి హరీష్,బాల్నే ప్రశాంత్ బైరు రజినికాంత్,గుర్రం హరీష్, నెక్కొండ మేజర్ గ్రామ వార్డ్ సభ్యులు దేవానబోయిన విజేందర్, జాతీయ బీసీ కమిషన్ నెక్కొండ మండలసభ్యులు మార్త మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఆహార భద్రతా చట్టానికి ప్రతిపాదించిన సవరణను ఉపసంహరించాలి

### వ్యకాస జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య



**తొలి అక్షరం/రామన్నపేట జులై 7:** జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కు ప్రతిపాదించిన సవరణను ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. స్థానిక శుభాష్ సెంటర్ లో సిపిఎం-వ్యకాస ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం మాట్లాడుతూ ఈ సవరణ ద్వారా అంత్యోదయ అన్న యోజన (ఏఏవై ) కింద ప్రస్తుతం అమలులో ఉన్న కుటుంబ ప్రాతిపదిక అర్హత విధానాన్ని తొలగించి, వ్యక్తి ప్రాతిపదిక అర్హత విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.ఒక్కో వ్యక్తికి 7 కిలోల ఆహార ధాన్యం ఇస్తామని చెప్పినా, పెద్ద కుటుంబాలకు దీనివల్ల ఎలాంటి అదనపు ప్రయోజనం ఉండదు. ఎందుకంటే వారి మొత్తం కోటా ఇప్పటికీ నెలకు 35 కిలోలకే పరిమితం అవుతుంది. అదే సమయంలో, చిన్న కుటుంబాలు ప్రస్తుతం పొందుతున్న 35 కిలోల పూర్తి హక్కును కోల్పోతాయి. దీంతో సమాజంలోని అత్యంత పేద, బలహీన వర్గాలపై ఈ సవరణ తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది.వృద్ధ దంపతులు, వితంతువులు, దివ్యాంగులు, గిరిజన కుటుంబాలు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, చిన్న కుటుంబాలు వంటి వర్గాలు కుటుంబ పరిమాణంతో సంబంధం లేకుండా దీనిపై ఆధారపడుతున్నాయి. ఈ సవరణ వారి ఆహార భద్రతను దెబ్బతీస్తుంది.ముఖ్యంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసి, సగటు కుటుంబ పరిమాణాన్ని తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలు ఈ సవరణ వల్ల నష్టపోతాయి. ఎన్నో సంవత్సరాలుగా, 2011 జనగణన ఆధారంగా ఉన్న ఎన్.ఎఫ్.ఎస్.ఏ లబ్ధిదారుల జాబితాను నవీకరించాలని విస్తృతంగా డిమాండ్ వస్తోంది. పాత జాబితాల కారణంగా లక్షలాది అర్హులైన ప్రజలు ఇప్పటికీ ఈ చట్టం ప్రయోజనాలకు దూరంగా ఉన్నారు. ప్రస్తుత జనాభా ఆధారంగా లబ్ధిదారుల జాబితాను నవీకరించి, చట్టం పరిధిని విస్తరించాల్సిన బదులు, మోదీ ప్రభుత్వం అత్యంత పేద ప్రజల ఆహార హక్కులను తగ్గించే ఈ సవరణను తీసుకురావడం విచారకరం.ఈ పేద వ్యతిరేక సవరణ ద్వారా, ప్రజల దీర్ఘకాల పోరాటాల ఫలితంగా ఆహారాన్ని చట్టబద్ధ హక్కుగా గుర్తిస్తూ తీసుకొచ్చిన జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని క్రమంగా బలహీనపరచాలనే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం బహిర్గతమవుతోంది.ప్రతిపాదిత సవరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, మండల కమిటీ సభ్యులు నాగటి ఉపేందర్ గొరిగెసోములు,బావండ్లపల్లి బాలరాజు, తొలుపునూరి శ్రీనివాస్, వ్యకాస మండల అధ్యక్షుడు మేడి ముకుంద,డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు మెట్టు శ్రవణ్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, నాయకులు శానాగొండ వెంకటేశ్వర్లు, నాగటి లక్ష్మణ్, గునుగుంట్ల సత్యనారాయణ, తరిగోప్పుల వెంకట్ రెడ్డి, తుర్కపల్లి నరేష్, గట్టు సుందర్, ఆకిటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో ఘనంగా మందకృష్ణ జన్మదిన వేడుకలు





**తొలి అక్షరం/రామన్నపేట జూలై 7:** రామన్నపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. మందకృష్ణ మాదిగ పుట్టినరోజును సుభాష్ సెంటర్ వద్ద కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది, ఆ మహానేత పుట్టినరోజులు పురస్కరించుకొని రామన్నపేట ప్రభుత్వ హాస్పిటల్ నందు పండ్ల పంపిణీ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ 33 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి వర్గీకరణ సాధించిన ఘనుడు ఆయన అని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఈర్లపల్లి మల్లయ్య ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉత్తటూరు సర్పంచ్, కోళ్ల రామకృష్ణ, సురేందర్రావు, బొడ్డు శంకరయ్య, మేడి శంకరయ్య, నకరికంటి మొగులయ్య, కొమ్ము రామస్వామి, నోముల ప్రవీణ్, కొమ్ము యాదయ్య, గాదే ఐలయ్య, నోముల కృష్ణ, నోముల విష్ణు, మేడి ఆంజనేయులు, మేడి స్వామి, ముత్యాల లింగయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు, బందేల నరేష్, గాదె ప్రభాకర్, మేడి రాజు, మరియు ఎమ్మార్పీఎస్ నాయకులు బందెల వెంకన్న, బందెల నరసింహ, స్వామి బలరాం మల్లేష్ ప్రసాద్ బూడిద నర్సింహా రవి శంకర్ మహేష్ కృష్ణ మహేష్ బాబు సాయిలు నర్సింహా తదితరులు పాల్గొనడం జరిగింది

## షాద్‌నగర్ చెందిన ఈ నాడు లక్ష్య అథ్లెట్ వి. విక్రమ్ ఘన విజయం.. స్వర్ణ పతకంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 07:** షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఈనాడు లక్ష్య అథ్లెట్ వి. విక్రమ్ జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబర్చి మరో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. జడ్చర్లలో మంగళవారం నిర్వహించిన 4వ తెలంగాణ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్లో బాయ్స్ అండర్-16 విభాగం 1000 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు.జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విక్రమ్ ఈ నెల 18వ తేదీన మెదక్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు. రాష్ట్ర స్థాయిలో కూడా ఇదే జోరును కొనసాగించి షాద్‌నగర్‌కు, జిల్లాకు మరిన్ని విజయాలు తీసుకురావాలని క్రీడాభిమానులు, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.చిన్న వయస్సులోనే క్రమశిక్షణతో సాధన చేస్తూ వరుస విజయాలు సాధిస్తున్న విక్రమ్ భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించే సత్తా ఉన్న అథ్లెట్‌గా ఎదుగుతున్నాడని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా విక్రమ్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు అభినందించారు. రాష్ట్ర స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి పతకం సాధించి షాద్‌నగర్‌కు మరింత పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.విక్రమ్ విజయానికి ఆయన కోచ్, జాతీయ పతక విజేత పండు నాయక్ అందించిన శిక్షణ, నిరంతర ప్రోత్సాహం ప్రధాన కారణమని పేర్కొన్నారు. తన శిష్యుడు రాష్ట్ర స్థాయిలో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని కోచ్ పండు నాయక్ ఆకాంక్షించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన గొట్లకొండ సర్పంచ్ భూక్య జనార్ధన్ నాయక్



**తొలి అక్షరం/నెక్కొండ జూలై 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని గొట్లకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు.ఆపదలో ఉన్న పేద, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించిన ఈ సహాయం వారికి ఎంతో ఊరటనిస్తుంది. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, నియోజకవర్గ ప్రజల పట్ల ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే కి హృదయపూర్వక ధన్యవాదాలు. లబ్ధిదారులు భూక్యా మౌనిక 16000 మరియు భూక్యా తరుణ్ 22000 అందజేయడం జరిగింది.సర్పంచ్ భూక్య జనార్ధన్ నాయక్, భూక్యా బహుసింగ్,లాల్ సింగ్, శ్రీనివాస్ వెంకన్న, రవి, వెంకన్న, అరుణ్ గుగులోత్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లితో సహా కాంగ్రెస్ అనుచరులకు 50 కోట్ల ముడుపులు

**దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్**

**ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

**సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ అధ్వర్యంలో షాద్ నగర్ చౌరస్తా లో ధర్నా**

**పాల్గొన్న బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వంకాయల నారాయణ రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్**








**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 07:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ముఖ్య కూడలి (చౌరస్తా ) లో సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కు వ్యతిరేకంగా ఆందోళన, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిధి గా పాల్గొని ధర్నా కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదని దీనివల్ల రైతులు, చుట్టూ ప్రక్క గ్రామాలు, తండాలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. డంపింగ్ యార్డ్ వద్దని ప్రజలు ఆందోళన చేస్తుంటే ఎమ్మెల్యే గారు వచ్చి ఎట్టి పరిస్థితి లో అక్కడ డంపింగ్ యార్డ్ రాదని హామీ ఇచ్చారని మరి ఇప్పుడు ఏమైంది అని నిలదీశారు. వెంటనే 641 జీవో ను ఆపాలని లేకుంటే రాజీనామా చేయాలనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు హరీష్ రెడ్డి లను సిద్దాపూర్ కు తీసుకొని వచ్చి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని అన్నారు. బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నిన్ను ఎన్నుకున్నది మంచి పనులు చేస్తావని కానీ నువ్వు ఇక్కడ చెత్త తీసుకొని వచ్చి చెత్త ఎమ్మెల్యే అయ్యావని అన్నారు. ఈ ఆందోళన ఇక్కడిదాక ఆగదని డంపింగ్ యార్డ్ రద్దయ్యే వరకు కొనసాగుతుందని అన్నారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ మా ఊరు, మా మండలం అని ఎమ్మెల్యే గారు అన్నారని మరి ఇప్పుడు ఆ మాటలు ఎక్కడికి పోయాయాని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్, దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్, యుగంధర్, రామకృష్ణ, దినేష్, శివా చారి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రపాలనగరంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**తొలి అక్షరం/రామన్నపేట జులై 7:** రామన్నపేట మండలంఇంద్రపాలనగరంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఈర్లపల్లి మల్లయ్య మాదిగ జెండా ఎగరవేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నల్ల స్వామి మాదిగ, సీనియర్ నాయకులు ఈర్లపల్లి రమేష్, ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షులు పదవ వార్డ్ మెంబర్ నల్ల ఎల్లేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు శివగల ముత్యాలు, మాజీ అధ్యక్షులు మంటి లింగస్వామి, నల్ల శంకరయ్య, శివగళ్ళ నరసింహా, పుట్టల ముత్యాలు, మంటి బిక్షమయ్య, గొల్లపల్లి యాదయ్య, చిన్న లచ్చి సైదులు, కొంగరి రాజలింగం, నల్ల భాస్కర్, మంటి స్వామి, మంటి బాబు, శివ గళ్ళ సంపత్, నల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు




## ఘనంగా బంజారాల ఆరాధ్య దైవం శీత్లా (దాటుడు) పండుగ

**తొలి అక్షరం/నెక్కొండ జూలై 7:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కోర్పోల్ గ్రామపంచాయతీ పరిధిలో సోమ్లా తండా, పంతులు తండా,రోడ్డు తండా,పాతండ పరిధిలో ఘనంగా సీత్లా పండుగ నిర్వహించడం జరిగింది. బంజారాల ఆరాధ్య దైవం ప్రకృతి వనంలో ఆనాటి కార్యక్రమాలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే పండగ భావితరాల వారికి సంస్కృతి,సాంప్రదాయాలను గుర్తు చేస్తూ కొనసాగించబడుతున్నటువంటి సీత్లా భవాని పండుగను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ బానోత్ మోహన్ బంజారా ఆడపడుచులు తండావాసులు పాల్గొనడం జరిగింది.



# ఫరూక్‌నగర్ మండల బేడ బుడగ జంగం సంఘం నూతన కమిటీ నియామకం

### మండల అధ్యక్షుడిగా వానరసి స్వామి.. ఉపాధ్యక్షులుగా సదుల స్వామి, కప్పేరా అనిల్ కుమార్





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 07:** బేడ బుడగ జంగం షాద్‌నగర్ తాలూకా అధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్ ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్ మండల బేడ బుడగ జంగం సంఘం సమావేశం నిర్వహించి నూతన మండల కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఘనంగా సత్కరించారు.నూతన కమిటీలో మండల అధ్యక్షుడిగా వానరసి స్వామి, ఉపాధ్యక్షులుగా సదుల స్వామి, కప్పేరా అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సదుల ఆనంద్, కోశాధికారిగా సదుల నందులను నియమించారు.ఈ సందర్భంగా తూర్పాటి వెంకటేష్ మాట్లాడుతూ బేడ బుడగ జంగం సమాజ అభివృద్ధి, ఐక్యత, సంక్షేమం కోసం ప్రతి సభ్యుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంఘం బలోపేతానికి నూతన కమిటీ సమిష్టిగా పనిచేసి సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశానికి సంఘం ముఖ్య నాయకులు వానరసి యాదయ్య, కళ్లెం ఉషయ్య, సదుల అంజయ్య, సదుల బాలకృష్ణ, సదుల పెంటయ్య, తూర్పాటి జంగయ్య, సదుల సత్యనారాయణ, సదుల యాదయ్య, కాలేం లింగం, తూర్పాటి దశరథ్, ఎన్. పెట్టయ్య, తూర్పాటి మల్లేష్, ఎస్. శ్రీశైలం, డి. లోకేష్, టి. పరశురాం, ఎస్. బిక్షపతి, టి. శ్రీశైలం, ఏం. మల్లేష్, వి. యాదయ్య, కే. జంగయ్య, కప్పేరా అంజయ్య, ఏం. యాదయ్య, బి. యాదయ్య, ఏం. నరసింహులు, ఏం. రాములు, కే. అంజి, ఎస్. సదానందం పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి..!

### జాతీయ బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ అప్ప డిమాండ్

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 07:** ప్రైవేటు పాఠశాలలు కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని జాతీయ బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ అప్ప డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖరప్ప మాట్లాడుతూ విద్య అనేది ప్రతి బిడ్డ హక్కు. దానిని వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపే విధానాలకు ముగింపు పలకాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్నా యనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయని, ప్రతి విద్యా సంవత్సరంలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ మధ్యతరగతి, పేద కుటుంబాలపై భారీ ఆర్థిక భారం మోపుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ట్యూషన్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, ల్యాబ్ ఫీజు, యాక్టివిటీ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు వంటి వివిధ పేర్లతో అదనపు రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, అంతేకాకుండా యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, షూస్, బెల్ట్, టై వంటి వస్తువులను విద్యాసంస్థల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చి, అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారన్నారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లోనే ఈ తరహా వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడం, విద్యార్థులు తప్పనిసరిగా నిర్దిష్ట దుకాణాలు లేదా పాఠశాలల నుంచే వస్తువులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని చంద్రశేఖరప్ప డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవా లని, అలాగే ఫీజుల నియంత్రణకు పారదర్శక వ్యవస్థను అమలు చేసి, ప్రతి విద్యార్థికి అందుబాటులో విద్యను అందించేలా చర్యలు చేపట్టాలన్నారు.



# రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా

- షాపులు సీజ్‌కూ వెనుకాడం
- నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సుల రద్దు, కేసులు నమోదు
- వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి హెచ్చరిక



**తొలి అక్షరం/కల్లూరు, జూలై 7:** మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు, కాలువలు, ఖాళీ స్థలాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని కల్లూరు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి హెచ్చరించారు. పరిశుభ్రతను విస్మరించి రోడ్లపై చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు పడేస్తున్న వ్యాపారులు, హోటల్ యజమానులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రధాన రహదారిని పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ, కొందరు షాపుల నుంచి వచ్చే చెత్తను నేరుగా రోడ్లపై పడేయడంతో పట్టణ పరిశుభ్రత దెబ్బతింటోందని అన్నారు. దీనివల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు.ప్రజా ప్రదేశాల్లో చెత్త వేయడం మున్సిపల్ చట్టాలు, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పట్టుబడిన వారికి వెంటనే జరిమానా విధిస్తామని, అదే తప్పు మళ్లీ చేస్తే భారీ జరిమానాతో పాటు చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే వ్యాపార సంస్థల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు షాపులను సీజ్ చేసే చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.కొత్తగా ఏర్పడిన కల్లూరు మున్సిపాలిటీని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఇళ్లలోనూ, వ్యాపార సంస్థల్లోనూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు.పరిశుభ్రత ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్న ఆయన, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై రాజీలేని చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన కల్లూరు నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

## ఈఎఫ్‌ల డిజిటైజేషన్ పనులను పరిశీలించిన సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్



**తొలి అక్షరం/కల్లూరు, జులై 7 :** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో విజ్ఞాన్ స్కూల్ రోడ్డులో ఉన్న పోలింగ్ స్టేషన్ నెం. 105, 102 లలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఎన్యూమరేషన్ ఫార్మ్స్ డిజిటైజేషన్ పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిజిటైజేషన్ పురోగతి, నమోదు ప్రక్రియ, వివరాల ఖచ్చితత్వాన్ని పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఫారమ్‌ను జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## 49వ డివిజన్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ఫారమ్‌లను అందజేయాలి

### - కార్పొరేటర్ ఏన్నంలక్ష్మీ ప్రకాష్




**తొలి అక్షరం/కరీంనగర్ జూలై 07:** కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ. (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ .. ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా, ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ప్రజలను కోరారు. బి ఎల్ ఓ ల ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను ఓటర్లు ఈ క్రింది విధంగా పూర్తి చేయాలని వివరాలు తెలియజేస్తూ సూచించారు.పార్ట్ 1: 2002లో ఓటు హక్కు కలిగి ఉన్న వారి వివరాలు,పార్ట్ 2: తల్లి లేదా తండ్రి వివరాలు,పార్ట్ 3: ప్రస్తుత నివాస వివరాలు ఫారమ్‌పై ఫోటోను అంటించాలని తెలిపారు. పూర్తి చేసిన ఫారమ్‌లను స్వయంగా అందజేయడానికి జూలై 7, 8. ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు. సనాతన ధర్మం ఆఫీస్, భాగ్యనగర్ రోడ్ నెం. 6 లో సంప్రదించాలని సూచించారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కు వివరాలను సరిచూసుకోవాలని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




## చిరుమర్తి సమక్షంలో మేడి. రాజు జన్మదిన వేడుకలు

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 7:** రామన్నపేట మండలంలోని ఉత్తటూరు గ్రామ బిఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ మేడి రాజు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన నకిరేకల్ మాజీ శాసన సభ్యులు చిరుమర్తి లింగయ్య ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోళ్ల కిషన్, మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి, పాల సంఘం మాజీ అధ్యక్షులు జంగిల్ నరసింహ, ఐదో వార్డ్ మెంబర్ పోతుల స్వామి, మేడి అబ్బి తదితరులు పాల్గొన్నారు

## వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



**తొలి అక్షరం/రామన్నపేట జులై 7:** రామన్నపేట రైతు వేదిక నందు పంచాయతీ రాజ్ మినిస్టర్ సీతక్క వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ నకు హాజరు కావటం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి ప్రణాళిక వి బి జి రామ్ జి పథకంలో పనులు చేపించాలని ఆదేశాలు ఇవ్వటం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాములు, ఎంపీవో రఫీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాఘవ ఏపీవో వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్స్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.







## తెలంగాణ ఉద్యమ నేతకు ఘన సన్మానం

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ ను వరంగల్ నగరంలో పోచం మైదాన్ రత్న హోటల్లో సన్మాన కార్యక్రమంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడ్డి శ్రీనివాస్,బేతి రాజు నరేష్ పాల్గొని ప్రొ,కూరపాటి వెంకటనారాయణ కు శుభాకాంక్షలు తెలియజేశారు.తెలుగు భాష,సాహిత్యం,సంస్కృతి అభివృద్ధికి ఆయన మరింత విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ అందరూ అభినందనలు తెలిపారు.

## అహోబిలం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన మాధవన్

### - అహోబిల క్షేత్ర అభివృద్ధికి కృషి

**తొలి అక్షరం/ఆళ్లగడ్డ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా మాధవన్ బాధ్యతలు చేపట్టారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ అహోబిలం పరిధి లోని నవ నరసింహ క్షేత్రాల్లో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. 46వ పీఠాధిపతి రంగనాథ్ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో అహోబిల క్షేత్రం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు అహోబిలం క్షేత్ర అభివృద్ధికి స్థానికులు, ప్రజాప్రతినిధులు భక్తులు సహకారం అందించాలని ఆయన కోరారు.


## మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన ఎంఆర్పీఎస్ నాయకులు



**తొలి అక్షరం/మల్లంపల్లి జూలై 07 :** మల్లంపల్లి మండలంలో ఎంఆర్పీఎస్ నాయకులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, ఎంఆర్పీఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి చాతాళ్ల రమేష్ మాదిగ సూచనలతో ఈ కార్యక్రమం జరిగింది.మండల నూతన అధ్యక్షుడు కొంగరి ప్రకాష్ మాదిగ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మంద కృష్ణ మాదిగ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడుతున్న ఉద్యమ నాయకుడని కొని యాడారు.ఆయన జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ఆశయాల సాధన కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాజకీయాల్లోకి ధనుష్? ..

## జెండా ఆవిష్కరించిన అభిమానులు!



తమిళనాడు రాజకీయాల్లో కోలీవుడ్ దళపతి విజయ్ సృష్టించిన సంచలన విజయం... ఇప్పుడు ద్రవిడ రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. రాజకీయాల్లోకి ప్రవేశించిన తొలిసారే ఏకంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించి, విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. కమల్ హాసన్ వంటి మహామహులకే సాధ్యం కాని ఈ రాజకీయ అద్భుతాన్ని విజయ్ సాకారం చేయడంతో, ఇప్పుడు కోలీవుడ్‌లోని మరికొందరు స్టార్స్ అటువైపు అడుగులు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలోనే కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కూడా త్వరలోనే రాజకీయ అరంగేట్రం చేయబోతున్నారనే ప్రచారం తమిళనాట జోరుగా సాగుతోంది. తాజాగా ధనుష్ అభిమాన సంఘం నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఒక అధికారిక జెండాను ఆవిష్కరించడం హాట్ టాపిక్‌గా మారింది. కేవలం జెండా రూపకల్పనకే పరిమితం కాకుండా, తమిళనాడు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని అభిమాన సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. ఇది పక్కా పొలిటికల్ స్కెచ్‌తోనే జరుగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి విజయ్ బాటలోనే ధనుష్ కూడా ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ సిద్ధం చేసుకుంటున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల సమయానికి పూర్తి ప్రణాళికతో పక్కాగా బరిలోకి దిగుతారని కోలీవుడ్ వర్గాల్లో గట్టి చర్చ నడుస్తోంది. మరోవైపు, తన పొలిటికల్ ఎంట్రీపై సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో ఇంత పెద్ద ఎత్తున ఊహాగానాలు వస్తున్నప్పటికీ... హీరో ధనుష్ వైపు నుంచి గానీ, ఆయన పీఆర్ టీమ్ నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడకపోవడం గమనార్హం.



# నా అండాలు దాచుకున్నా : నటి కృతి సనన్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక కీలకమైన, స్ఫూర్తిదాయకమైన విషయాన్ని వెల్లడించారు. కెరీర్‌లో 'మిమి', 'క్రూ', 'బరేలీ కి బర్ఫీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దూసుకుపోతున్న ఆమె.. పెళ్లి, పిల్లల విషయంలో మహిళలు ఎదుర్కొనే సామాజిక, వయసు సంబంధిత ఒత్తిడిని అధిగమించేందుకు తాను కొన్ని సంవత్సరాల క్రితమే తన అండాలను ఫ్రీజ్ (జుస్త్రస్త్ర ఖీతీవవఓఅఅస్త్ర) చేయించుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా తన జీవితాన్ని తనకు నచ్చినట్లుగా, ఎలాంటి టైమ్‌లైన్ ఒత్తిడి లేకుండా జీవించే స్వేచ్ఛను పొందానని ఆమె పేర్కొన్నారు. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' వ్యవస్థాపకురాలు కరిష్మా మెహతాతో జరిగిన ఒక ఇంటర్వ్యూలో కృతి ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మహిళలు ఎదుర్కొనే 'బయోలాజికల్ క్లాక్' సమస్య గురించి హోస్ట్ ప్రశ్నించగా, కృతి స్పందిస్తూ.. "నిజాయతీగా చెప్పాలంటే, నేను నా అండాలను ఫ్రీజ్ చేయించుకున్నాను. పెళ్లి ఇప్పుడే చేసుకోవాలి, పిల్లల్ని ఇప్పుడే కనాలి అనే ఒత్తిడికి నేను లోనవ్వాలని అనుకోలేదు. వివాహం అయినా, పిల్లలైనా సరే.. మనసులోంచి రావాలి కానీ, ఎవరో చెప్పారని, వయసు అయిపోతోందని కాదు" అని ఆమె స్పష్టం చేశారు. ఈ సదుపాయం అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చని, కానీ తాను ఆ ఖర్చు భరించగలిగినందుకు అదృష్టవంతురాలినని ఆమె అన్నారు. ఈ ప్రక్రియను ఎప్పుడు పూర్తి చేశారనే విషయాన్ని కూడా కృతి వివరించారు. జాతీయ అవార్డు సాధించిపెట్టిన 'మిమి' సినిమా కోసం ఆమె 15 కిలోల బరువు పెరగాల్సి వచ్చింది. ఆ సమయంలోనే తాను ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "ఆ సినిమా కోసం బరువు పెరగడానికి నాకు రెండు నెలల సమయం దొరికింది. షూటింగ్ లేదు. అప్పుడే ఈ ప్రక్రియ గురించి ఒకరు నాకు సలహా ఇచ్చారు. ఇది మహిళలు తమకు తాము ఇచ్చుకునే ఉత్తమ బహుమతి అని చెప్పారు. పైగా 'మిమి' సినిమా సరోగసీ నేపథ్యంతో కూడుకున్నది కావడంతో, ఆ సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం సరైనదనిపించింది" అని కృతి గుర్తుచేసుకున్నారు.

# వేగం అందుకున్న వెంకీ-అనిల్ సినిమా..

## సెట్స్‌లోకి వెంకటేశ్

వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కలిసి నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ వేగం అందుకుంది. దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కీలక షెడ్యూల్ ప్రారంభమైంది. దీంట్లో పాల్గొనేందుకు వెంకటేశ్ తాజాగా సెట్స్‌లో అడుగుపెట్టారు.

ప్రస్తుతం ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ ఎపిసోడ్లలో వెంకటేశ్‌తో పాటు నందమూరి కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. ఇటీవల కల్యాణ్‌రామ్ పుట్టినరోజును చిత్రబృందం సెట్స్‌లోనే జరుపుకొంది. అదే సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసి, 2027 సంక్రాంతికి సినిమా విడుదల కానుందని ప్రకటించింది.

ఇటీవల ఈ సినిమా పేరుతో నకిలీ కాస్టింగ్ కాల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో నిర్మాతలు హెచ్చరిక జారీ చేశారు. అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా వచ్చే ప్రకటనలను మాత్రమే నమ్మాలని, వ్యక్తిగత వివరాలు లేదా డబ్బు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ ఇవ్వొద్దని స్పష్టం చేశారు.

కొద్ది రోజుల క్రితమే ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



వెంకటేశ్‌తో అనిల్ రావిపూడికి ఇది ఐదో సినిమా. ఇప్పటికే 'ఎఫ్2', 'ఎఫ్3', 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి విజయాల తర్వాత మరోసారి ఇద్దరూ చేతులు కలిపారు. కల్యాణ్‌రామ్‌తో అనిల్‌కు ఇది రెండో చిత్రం. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'పటాస్' మంచి విజయం సాధించింది.

ఈ చిత్రాన్ని అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునే కుటుంబ వినోద కథగా రూపొందిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. హాస్యం, భావోద్వేగాలు, వినోదానికి సమాన ప్రాధాన్యం ఉండేలా అనిల్ రావిపూడి తన శైలిలో సినిమాను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం.

# ముఖాలు మారినా పద్ధతులు మారలేదు

## : 'అమ్మ'కు రేవతి, పద్మప్రియ రాజీనామా!





మలయాళ సినీ తారల సంఘం 'అమ్మ'లో సంక్షోభం మరింత ముదిరింది. జస్టిస్ హేమా కమిటీ నివేదిక వెలువడిన తర్వాత చెలరేగిన వివాదాల నేపథ్యంలో అప్పటి అధ్యక్షుడు మోహన్‌లాల్, ఆయన కార్యవర్గం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 'అమ్మ'కు తొలి మహిళా అధ్యక్షురాలిగా రికార్డు సృష్టిస్తూ నటి శ్వేతా మీనన్ బాధ్యతలు చేపట్టారు. అయితే, తాజాగా జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమె కమిటీపై కూడా పలు ఆరోపణలు రావడంతో శ్వేతా మీనన్‌తో పాటు మొత్తం కార్యవర్గం మూకుమ్మడిగా రాజీనామా చేసింది. ఈ తీవ్ర అనిశ్చితి మధ్య, పరిశ్రమలోని సీనియర్ నటీమణులు రేవతి, పద్మప్రియ సైతం 'అమ్మ' ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం మలయాళ చిత్రసీమలో సంచలనంగా మారింది. పని ప్రదేశాల్లో మహిళల భద్రత, సమాన వేతనాల కోసం పోరాడుతున్న 'విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్' (ఔజజ) వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న రేవతి, పద్మప్రియ ఈ నిర్ణయంపై ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సంస్థలో అధికారం చేతులు మారినప్పటికీ ప్రాధాన్యతలు మారలేదని, 'అమ్మ'లో ఇంకా పితృస్వామ్య ధోరణులు, అధికార రాజకీయాల ప్రభావం కొనసాగుతూనే ఉందని వారు ఆరోపించారు. తాము ఎన్నో దశాబ్దాలుగా ఈ రంగానికి సేవ చేశామని, భవిష్యత్తు మెరుగ్గా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మలయాళ సినిమా ఎప్పటికీ తమదేనని, దాని కోసం పనిచేయడానికి ఎలాంటి సంస్థ సభ్యత్వాలు అవసరం లేదని వారు కుండబద్దలు కొట్టారు.

# హీరోల తప్పులను ఎత్తి చూపడం చాలా కష్టం



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, హీరోయిన్ పార్వతి తిరువోతు జంటగా నటించిన లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ఐనోబడీ'. నిస్సాం బషీర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ బ్యాంక్ ఉద్యోగి రాజీవన్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మలయాళంలో ఈ నెల 9న, తెలుగులో 10న థియేటర్లలో విడుదల కాబోతోంది. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా నటి పార్వతి మలయాళ చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత పరిస్థితులపై, హీరోల చుట్టూ అలుముకున్న కల్చర్‌పై చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

గడిచిన ఎనిమిది, తొమ్మిదేళ్లలో మలయాళ సినీ పరిశ్రమలో కొన్ని మార్పులు వచ్చిన మాట వాస్తవమే అయినా... అవన్నీ మనస్ఫూర్తిగా వచ్చినవి కావని పార్వతి కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల నుంచి వచ్చిన విమర్శలు, మీడియా నిరంతరం చూపించిన శ్రద్ధ వల్లే ఇండస్ట్రీలో ఆ మార్పులు జరిగాయని ఆమె అభిప్రాయపడ్డారు. మలయాళ చిత్రసీమలో స్టార్ హీరోలను పూజించే సంస్కృతి అలాగే కొనసాగుతోందని, ఇక్కడి సూపర్‌స్టార్లను దేవుళ్లలా పూజించడం వల్లే వారి తప్పులను ఎత్తిచూపడం ఎవరికైనా చాలా కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఉండటం వల్లే ఇండస్ట్రీలో బాగా పలుకుబడి ఉన్న వ్యక్తులు, కొత్తగా వచ్చే వారిపై తమ అధికారాన్ని చాలా సులభంగా చెలాయిస్తున్నారని ఆమె మండిపడ్డారు. పలుకుబడి ఉన్నవారు కొత్తవారి టాలెంట్‌ను తొక్కేస్తూ, వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సినిమా రంగంలో సానుకూల మార్పులు చాలా నెమ్మదిగా సాగుతుండటం తనకు ఎంతో నిరాశ కలిగిస్తోందని... అయినప్పటికీ ఇండస్ట్రీలో మహిళల హక్కుల కోసం, పని చేసేందుకు అనువైన మంచి వాతావరణం కోసం తమ మహిళా సంఘం చేస్తున్న పోరాటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఆపేది లేదని పార్వతి స్పష్టం చేశారు.

# యాక్షన్ మోడ్‌లోకి మెగాస్టార్..

## హైదరాబాద్‌లో 'మెగా158' భారీ ఫైట్ సీక్వెన్స్ షురూ

మెగాస్టార్ చిరంజీవి తన 158వ సినిమా కోసం యాక్షన్ మోడ్‌లోకి ప్రవేశించారు. దర్శకుడు బాబీ కొల్లితో ఆయన చేస్తున్న ఈ ప్రాజెక్టులో ఓ భారీ యాక్షన్ ఘట్టం చిత్రీకరణ మొదలైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న రెండో షెడ్యూల్‌లో భాగంగా ప్రముఖ స్టంట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ సారథ్యంలో ఈ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. ఈ యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులకు వింటేజ్ చిరంజీవిని గుర్తుకు తెచ్చేలా ఉంటాయని చిత్ర యూనిట్ చెబుతోంది.



'మెగా158' (వర్కింగ్ టైటిల్) రెండో షెడ్యూల్ జూన్ 22న హైదరాబాద్‌లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. దీనిపై నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ గతంలోనే ప్రకటన విడుదల చేసింది. "పొల్లాచ్చి అందాల నుంచి మరో భారీ ఘట్టంలోకి అడుగుపెట్టాం. మెగాస్టార్ ప్రతి షాట్‌ను ఓ ఉత్సవంగా మారుస్తున్నారు" అని పేర్కొంది. అంతకుముందు తమిళనాడులోని పొల్లాచ్చిలో తొలి షెడ్యూల్‌ను చిత్ర బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు.

'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల యువనటి అనస్వరా రాజన్‌ను చిత్ర బృందంలోకి అధికారికంగా స్వాగతించారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తుండగా, 'జైలర్' ఫేమ్ విజయ్ కార్తీక్ కణ్ణన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. కొల్లా అవినాశ్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

గత ఏడాది చిరంజీవి పుట్టినరోజున ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ పాత్ర కోసం చిరంజీవి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న వీడియోను పంచుకుని అభిమానులను ఉత్సాహపరిచారు. 'ది బ్లేడ్ దట్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్' అనే ట్యాగ్‌లైన్‌తో విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.